సంపుటి : 3 కీర్తన : నీవే యంతర్యామివి నీవున్నదే వైకుంఠము

సంఖ్య : 579 పుట : 389 రాగం : లలిత

**లలిత**

71\. నీవే యంతర్యామివి నీవున్నదేవైకుంఠము
ఆవలఁ బరమపదమన నింకాఁ గలదా ॥పల్లవి॥

యిందరు జంతువులు నీవిచ్చినరూపులు మోచి
బొందితో నీకే నెలవై పుట్టినారు
కందువ నీ ప్రపంచపు కైంకర్యములు సేసి
అందిరి జీవన్ముక్తు లదివో చాలదా ॥నీవే॥

యేలిక వంచినపనే యింద్రియభోగములెల్ల
తోలితోలి రాచాజ్ఞ తోయకున్నారు
కాలము నిన్నుఁ బాయరు గర్భగోళమందున్నారు
యీలోకమే సాలోక్య మిది యింత చాలదా ॥నీవే॥

జ్ఞానము నజ్ఞాన మేది స్వామికార్యములోన
మానక నీపనులలో మత్తులైనారు
శ్రీనాథుడవు నీవే శ్రీవేంకటేశ్వర
నీనాటకములోనే నిత్యులైరి చాలదా ॥నీవే॥ 579

**అవతారిక :**

శ్రీమహావిష్ణువు, వైకుంఠం, సనకాదిఋషులు ఇంద్రాది దేవతలు - ఇవన్నీ పురాణేతిహాసాల ద్వారా మనం భగవంతుని స్మరించే సాధన ప్రక్రియలో అంతర్భాగం మాత్రమే. మాంసచక్షువులతో వీరిని చూడటం సాధ్యమయ్యేపనిగాదు. అసలు చూడవలసిన పనేలేదు. ఎందుకంటే ఆ నారాయణుడే అంతర్యామిగా మన అందరిలోను వున్నాడు. ఆయన వున్న ఈ దేహమే వైకుంఠం. అందరిలో వున్న హరి ఒక్కడే అని తెలుసుకోవటమే పరమపదము పొందటం. జీవిత కాలంలోనే ఈ సత్యాన్ని గ్రహించినవాడు రాగద్వేషాలకు అతీతుడుగా వుంటాడు. ఆ స్థితి చేరుకోవటమే జీవన్ముక్తి.



Scanned with CamSc

వాడికి మళ్ళీ పుట్టుక వుండదు. మరి ఈలోగా మనం పొందుతున్న ఈ అనుభవాలన్నీ యేమిటి? ఇదే శ్రీవేంకటేశుని నాటకము అంటున్నారు అన్నమాచార్యులవారు.

**భావవివరణ:**

ఓ దేవదేవా! మాలోవున్న అంతర్యామివి (ఆత్మస్వరూపుడు) నీవే. నీవు నెలకొనివున్న ఈ దేహమే వైకుంఠము. ఇంకా అవతల పరమపదము (మోక్షము) అనేదివేరే వున్నదా? లేనేలేదు స్వామీ!

నీవిచ్చిన వేర్వేరు రూపాలతో వీరంతా రకరకాల జంతు రూపములను దాల్చారు. ఏదో ఒక బొంది (శరీరం) మోచి (దరించి) నీకే స్థానమైనట్లు పుట్టినారు. కందువ (చమత్కారంతో) ఈ ప్రపంచాన్ని (వారి ప్రాపంచిక జీవితాన్ని)నీకే కైంకర్యం చేసి జీవన్ముక్తిని పొందారు. అదిగో అది చాలదా ప్రభూ! వేరే వైకుంఠం... విష్ణుదూతలు... ఇదంతా యెందుకు?

మహానుభావా! నీవే యేలికవు (పరిపాలకుడవు). మేము పొందుతున్న ఈ ఇంద్రియ భోగాలన్నీ ఎవరిచ్చారు? నీవు పంచినవే (పంచిపెట్టినవే కదా!) మరి ఈ జీవులంతా, తోలితోలి (అదలించబడిన వారై) రాజాజ్ఞను (తమ యేలిక ఆజ్ఞను) తోయలేకున్నారు (ధిక్కరించలేకున్నారు). కాలము నిన్ను బాయరు (క్షణంకూడా నిన్ను వదలిపెట్టరు). ఎందుకంటే వీరుండేది ఎక్కడో కాదు... నీ గర్భగోళంలోనే (విశ్వరూపుడవైన నీ కడుపులోనే) వున్నారు. అందుచేత ఈ లోకమే సాలోక్యము (నీవుండేలోకం). దేవా! ఇది తెలుసుకుంటే చాలదా? ఇంకా ఏమి తెలుసుకోవాలి?

ప్రభూ! నీ పనులలో (సేవలో) మత్తులైనారు (తన్మయత్వం పొందేవారు) కోరుకునేది నీసేవ మాత్రమే. స్వామికార్యమునే సర్వస్వం అనుకొనేవారు జ్ఞానులైతే నేమి? అజ్ఞానులైతేనేమి? ఓ శ్రీవేంకటేశ్వరా! నీవే శ్రీనాథుడవు. వీరంతా నీ నాటకంలో పాత్రధారులు. వీరంతా నిత్యులే. ఏదో ఒక జన్మలో, ఏదో ఒకచోట, ఏదో ఒక పాత్ర ధరిస్తారు. నేనూ అటువంటి పాత్రధారినే. నాకు ఆ తృప్తి చాలదా తండ్రీ!



Scanned with CamSc

2
25.5.2020



4-88

## మున్నుడి

తనతండ్రి అన్నమాచార్యులవారి వలె పెద తిరుమలాచార్యులవారు కూడా విస్తృతంగా విశిష్టాద్వైత మతాన్ని ప్రచారం చేశారు. ఆ మతాన్ని ఆవిష్కరించిన శ్రీరామానుజాచార్యులవారిని శ్రీహరి అవతారంగా ఆరాధించారు పెదతిరుమల. తమిళులు శ్రీరామానుజుల వారిని "ఉడయవరు" (ప్రధాన అర్చకుడు) అని "ఎంబర్ మన్నార్" నడయాడే దైవము అని పిలుస్తారు "ఇదిగో శ్రీవేంకటేశ్వరుని ఈడై పొదలుచున్నాడు భువిని ఉడయవరు" అంటున్నారు. గురువులంటే అంత ఆరాధన వారికి.

ఆ.వె॥ ఉడయవరుని మెచ్చి ఉన్నతోన్నతుడని
తాననంతుడనెను తాళ్ళపాక
పెద్ద తిరుమలయ్య వినుతించె చూడరో
వేంకటపతి సముడు వేత్త అనెను

రాగం : సునాదవినోదిని

ఉన్నతోన్నతుడు వుడయవరు
ఎన్ననంతుడే ఈ ఉడయవరు ॥ఉన్నతో॥

సర్వలోకముల శాస్త్రరహస్యములు
ఉర్విపొడమెనీ ఉడయవరు
పూర్వపు వేదాంత పుణ్యశాస్త్రములు
నిర్వహించెనన్నిటా ఉదయవరు ॥ఉన్నతో॥

వెక్కసపు శ్రీవిష్ణు భక్తియే
ఒక్క రూపమే ఉదయవరు
చక్కనైన సుజ్ఞానమున కిరవై
వుక్కుమీరెను ఇదె ఉదయవరు ॥ఉన్నతో॥



Scanned with CamSc

కదిసి మోక్ష సాకారము తానై
ఉదుటున నిలిచెనీ ఉదయవరు
ఇదిగో శ్రీవేంకటేశ్వరుని తోడై
పొదలుచున్నాడు భువిని ఉదయవరు ॥ఉన్నతో॥

**భావామృతం :**

ఉదయవరు (ప్రధాన అర్చకుడు) అని పిలువబడే ఈ శ్రీరామానుజాచార్యులవారు ఉన్నతులైన వారందరిలోన ఉన్నతుడైన గురువు. ఎంచి చూడవలెనంటే అనంతుడైన శ్రీమహావిష్ణువునకు ఈయనకు తారతమ్యమే లేదు.

అన్ని లోకములలోనున్న శాస్త్ర రహస్యములను భూలోకంలో పొడజూపించిన గురుదేవుడీ ఉదయవరు. వేదకాలంనుండి వెలుగులోనికి వచ్చిన పుణ్యశాస్త్రములను అన్నిటియందు నిర్వహించిన పుణ్యాత్ముడీ ఉదయవరు.

వెక్కసమైన (దుర్లభమైన) విష్ణు భక్తియే ఒక్క రూపముగా దాల్చిన వాడే ఉదయవరు. చక్కని విజ్ఞానమునకు ఇరవై (స్థానమై), ఇదిగో అధికమైన స్థైర్యముతో ఈ ఉదయవరు వున్నాడు.

గొప్ప ఉద్ధతితో తానే సాకారమైన మోక్షము అన్నట్లు ఈ ఉదయవరు నిలచియున్నారు. ఇదిగో శ్రీవేంకటేశ్వరునికి సమానమైన వాడై ఈ ఉదయవరు ఈ భూలోకంలో పొదలుచున్నాడు. (వర్ధిల్లుచున్నాడు). ఈయనను శరణనండి, ధన్యులు అవండి.